www.prajasakti.com

# ప్రజాశక్తి

సోమవారం 5 ఆగస్టు 2024

5



డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

## 6న ఖేలో ఇండియా 'రైజింగ్ టాలెంట్ ఐడెంటిఫికేషన్'

**ప్రజాశక్తి-అమలాపురం**

భారతీయ ఖేల్ అధికార్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో బాలయోగి స్టేడియంలో అథ్లెటిక్స్, వాలీబాల్ వెయిట్ లిఫ్టింగ్ విభాగాల్లో ఖేలో ఇండియా రైజింగ్ టాలెంట్ ఐడెంటిఫికేషన్ కార్యక్రమం నిర్వహిస్తారని వైఎస్ఆర్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియం, బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్, యానాం జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ ఎస్ ఉదయ భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 6 తేదీ ఉదయం 8 గంటలకు 9 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల. ఆసక్తిగల అథ్లెట్లు, ఆటగాళ్లందరూ ప్రతిభ వంతులైన అథ్లెట్లు, ఆటగాళ్ల గుర్తింపు కోసం స్థానిక బాలయోగి స్టేడియం జిల్లా స్పోర్ట్స్ అథారిటీ లో రిపోర్ట్ చేయాలని ఆయన సూచించారు. వివిధ క్రీడలను సంబంధించిన క్రీడలో అత్యుత్తమ ప్రతిభను గుర్తించి వివిధ క్రీడా పోటీలకు ఎంపిక చేసే అవకాశం ఉంటుం దన్నారు.

# మతోన్మాద శక్తులను బలహీనపరచడమే లక్ష్యం

- సిపిఎం జిల్లా విస్తృత సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి పిలుపు

**ప్రజాశక్తి-అమలాపురం**

ఈ దేశాన్ని పట్టిపీడిస్తున్న మతోన్మాద శక్తులను బలహీనపరచడమే సిపిఎం ప్రధాన లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి అన్నారు. సిపిఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశం స్థానిక పార్టీ కార్యాలయంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గాప్రసాద్, కె.కృష్ణవేణి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి మాట్లాడుతూ గత ఎన్నికల్లో గెలిచామని చెబుతున్న బిజెపి ప్రభుత్వం నైతికంగా ఓడిపోయిందన్నారు. 400 స్థానాలు గెలుస్తామని రాజ్యాంగాన్ని మారుస్తామని ప్రగల్భాలు పలికిన బిజెపి నేడు అదే రాజ్యాంగాన్ని చూపుతూ ప్రజల్ని మోసగించడానికి ప్రయత్నం చేస్తోందన్నారు. బిజెపి దాని అనుబంధం సంస్థలు ఆర్ఎస్ఎస్ మతోన్మాద శక్తులను ఈ దేశంలో బలహీనపరచడమే సిపిఎం లక్ష్యమన్నారు. గత 10 ఏళ్లలో బిజెపి తన మాత సంస్థ ఆర్ఎస్ఎస్ తో కలిసి దేశ ప్రజల మధ్య ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం తీవ్రంగా చేసిందన్నారు. ఒక పక్క మతోన్మాదు విధానాలు మరో పక్క సరళీకరణ ఆర్థిక విధానాలు అవలంబిస్తూ ఈ దేశాన్ని దేశ సంపదని కార్పొరేట్ సక్తులకు కంపెనీలకు కట్టబెట్టిందని ఎద్దేవా చేశారు. దేశం అభివద్ధి అంటే అంబానీ, అదానీలు అభివద్ధి చెందటమేగా ప్రధాని భావిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా కాలంలో దేశం మొత్తం అల్లాడిపోతుంటే కార్పొరేట్ కంపెనీలు లాభాలు మాత్రం పెరిగాయన్నారు. దీనికి కారణం కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రయివేటీకరణ విధానాలేనని అన్నారు. సిపిఎం దేశవ్యాప్తంగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తగిన స్థానాల్లో గెలవక పోయినప్పటికీ బిజెపి మతోన్మాద శక్తులను ఓడించాలనే లక్ష్యాన్ని సాధించామన్నారు. బిజెపి మౌలికంగా ఓడిపోయిందన్నారు.

### సమస్యల ఎజెండాగా పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించాలి

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బి.బలరాం, అంద్రా మల్యాద్రి మాట్లాడుతూ ప్రజా సమస్యలు ఎజెండాగా తీసుకొని రాబోయే కాలంలో ఈ జిల్లాలో పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించాలన్నారు. ప్రధానంగా జిల్లాలో ఈ కాలంలో సంభవించిన గోదావరి వరదల కారణంగా వందల కుటుంబాలు నిరాశ్రయులయ్యారన్నారు. వేలాది ఎకరాలు వరి, కూరగాయలు తదితర పంటలు నాశనం అయ్యాయన్నారు. ప్రభుత్వం తగిన స్థాయిలో స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు నేటికీ వరదబాధిత కుటుంబాలకి ప్రకటించిన కనీసం రూ.3వేలు అయినా అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వరద బాధిత కుటుంబాలకు ఆరు నెలల పాటు పనులు దొరికే అవకాశం లేదని ఆరు నెలలు రూ.10వేలు చొప్పున జీవన భృతి కల్పించాలన్నారు. పంట నష్టపోయిన రైతులకు ప్రతి ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ కూలీలు గత మే నెల నుంచి బకాయి వేతనాలు చెల్లించలేదని తక్షణం రూ.70 కోట్ల బకాయి వేతనాలు విడుదల చేయాలన్నారు. కౌలు రైతులు రైతులు గత సీజన్లో కొనుగోలు చేసిన ధాన్యం బకాయిలు చెల్లించాలని తదితర డిమాండ్లు రూపొందించుకుని కార్యాచరణ చేస్తామని వారు తెలిపారు. సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు ఈ జిల్లాలో రాబోయే కాలంలో నిర్వహించాల్సిన ఉద్యమాలు, పోరాటాలను కర్తవ్యాల రూపంలో ప్రజెంట్ చేశారు. జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖలు నుంచి సుమారు 200 మంది పార్టీ సభ్యులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పీతల రామచంద్రరావు, నూకల బలరాం, టి.నాగవరలక్ష్మి, నాయకులు సఖిలే సూర్యనారాయణ, సూర్యప్రకాశరావు, తాడి శ్రీరామ్ మూర్తి, పొలమూరి శ్రీనివాసరావు, టి.మోహన్రావు, భీమాల శ్రీను తదితరులు పాల్గొన్నారు




సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవి,పాల్గొన్న నాయకులు

## బోడసకుర్రు మత్స్యకారులను ఆదుకోవాలి

**ప్రజాశక్తి-అమలాపురం**

బోడసకుర్రు గ్రామంలో మత్స్యకారులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ మత్స్యకార్మిక సంఘం డిమాండ్ చేసింది. అల్లవరం మండలం స్థానిక గోదావరి ముంపు గ్రామాల్లో ఏపీ మత్స్యకార్మిక సంఘం ఆదివారం పర్యటించింది. బోడసకుర్రు, రెబ్బనపల్లి తదితర మత్స్యకారుల గ్రామాలను ఏపీ మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు, సంఘం సభ్యులు టి.వరలక్ష్మి, పి శ్రీనివాసరావు సందర్శించి మత్స్యకారులు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బోడసకుర్రు గ్రామానికి గోదావరి ఒడ్డున కరకట్ట లేక వరదనీరు గ్రామంలోకి రావడంతో ఇంట్లు మునిగి పోతున్నా యని వాష్ రూమ్లు వరద నీటితో నిండి పోవడంతో రోగాల బారిన పడుతున్నామని స్థానిక నాయకులు తెలిపారు. వరద వచ్చినపుడు చేపల వేట చేయకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు పడుతు న్నామన్నారు. బియ్యం, పాలు, నిత్యావసరాలు ఇస్తామని చెప్పి ఇన్ని రోజులు అవుతున్నా మా సమస్య తీరాడంలేదన్నారు. కొల్లాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ అంతా కలిసి మన సమస్యలు పోరాడి పరిష్కారం చేసుకుందామన్నారు. సోమవారం కలెక్టరేట్ కి కలిసి మాట్లాడుదాం అని దీనితో పాటు 48 మోటరైజ్డ్ బోట్లకు, సంప్రదాయ మత్స్యకారులకు తక్షణమే రిజిస్ట్రేషన్ చేయాలి, చేపల వేట నిషేధ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మత్స్యకారుల గ్రామాల గోదావరిలో మునిగి పోతున్నా ఫిషరీస్ అధికారులు పట్టించుకోకపోవడం అవమానంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు చింతా నాగూల్ మీరా, జగతాడి రాఘువలు, సంగాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పర్యటిస్తున్న మత్స్యకార్మిక సంఘం నాయకులు

## అందరి భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి

**ప్రజాశక్తి-ముమ్మిడివరం**

ప్రజలందరి భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి సాకారం అవుతుందని నల్లా వారి పేట గ్రామ సంఘం పేర్కొంది. ముమ్మిడివరం మండలంలోని సిహెచ్.గున్నేపల్లి నల్లావారి పేట గ్రామ సంఘం సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో తీసుకువెళ్ళడానికి, గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. దీనిని సంఘ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో సబ్బతి రాంబాబు, సఖిలే వెంకటేశ్వరరావు, నల్లా సూర్యప్రకాష్, కఠారి శ్రీనివాసరావు, గంటి నాగ మునిశ్వరారావు, ఉల్లింగ నాగేంద్ర, కుంచె శ్రీను, కత్తుల శివలతో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## నాగులచెరువుకు బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

**ప్రజాశక్తి-కపిలేశ్వరపురం**

మండలంలోని నాగుల చెరువు గ్రామానికి ఆర్టిసి బస్సు సౌకర్యం కల్పించాలని ఎంపిటిసి సభ్యులు కుంచే ప్రసన్నకుమార్ అధికారులు కోరారు. ఆదివానం ఆయన మాట్లాడుతూ నాగుల చెరువు గ్రామానికి రహదారి సౌకర్యం ఉన్నప్పటికి శివారు ప్రాంతం కావడంతో ఆర్టిసి అధికారులు ఇప్పటి వరకు బస్సు సౌకర్యం కల్పించలేదన్నారు. నాగుల చెరువు గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు చదువుల నిమిత్తంవెళ్లే విద్యార్థులు ,ప్రయాణికులకు బస్సు సౌకర్యం లేక పలు అవస్థలు పడుతున్నారన్నారు. గతంలో ఇదే సమస్యను అనేకసార్లు అధికారుల దష్టికి తీసుకు వెళ్లినప్పటికి ఫలితం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నాగుల చెరువు గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించి విద్యార్థులు, ప్రయాణికులు, అవస్థలు తొలగించాలని ప్రసన్నకుమార్తో పాటు గ్రామస్తులు కోరుతున్నారు. విద్యార్థులను దష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు స్పందించి గ్రామానికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరుతున్నారు.

## ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలి

**ప్రజాశక్తి-కపిలేశ్వరపురం**

మండపేటలో సోమవారం నిర్వహించే ఉచిత వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సాయి ఆర్థో అండ్ ట్రామా కేర్ ఆసుపత్రి, ప్రముఖ ఎముకల వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ కె.రాము ఆదివారం తెలిపారు. నేడు వైద్య నిపుణులు డాక్టర్ కె.రాము పుట్టినరోజు సందర్భంగా ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని మండపేట, పరిసర ప్రాంతాలప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. శిబిరంలో ఎముకలు, స్త్రీల సమస్యలు, జనరల్ వ్యాధులు, గుండె తదితర సమస్యలు, ఫిజియో థెరపీ సంబంధించి వైద్య సేవలను ప్రముఖ వైద్యులచే అందిస్తామన్నారు. ఇందులో భాగంగా బిఎండి, ఇసిజి, షుగర్ వంటి పరీక్షలు, ఎక్స్రే, మందులు ఉచితంగా అందిస్తారన్నారు. మండపేట బిఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలోని సాయి ఆర్థో అండ్ ట్రామా కేర్ ఆసుపత్రి వద్ద ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటలు వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. మండపేట పరిసర ప్రాంత ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు.

## వ్యాధుల వ్యాపించకుండా పారిశుధ్య పనులు

**ప్రజాశక్తి-మామిడికుదురు**

అంటువ్యాధులు వ్యాపించకుండా ప్రతీ గ్రామంలో పూర్తిస్థాయిలో శానిటేషన్ పనులు చేపట్టాలని డిఎల్పిఒ బొజ్జి రాజు ఆదేశించారు పాశర్లపూడి లంకలో నిర్వహిస్తున్న శానిటేషన్ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. గత 15 రోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా పలు ప్రాంతాలలో వైరల్ జ్వరాలు, డయేరియా, డెంగీ వంటి వ్యాధులు నమోదవుతున్న నేపథ్యంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు కాలనీలలో మురికి నీరు నిలవ ఉండకుండా మళ్లించాలన్నారు ఇఒపిఆర్డి అడబాల శ్రీనివాసరావు, సర్పంచ్ తెలగారెడ్డి సూర్య ప్రకాశరావు, ఎంపిటిసి సభ్యురాలు చెరుకూరి పార్వతీ సత్తిబాబు, పంచాయతీ కార్యదర్శి డి.సురేష్ శానిటేషన్ పనులు పర్యవేక్షించారు.

## నేడు కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

**ప్రజాశక్తి-అమలాపురం**

ప్రజా సమస్యల ఫిర్యాదుల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్) కార్యక్రమం ఆగస్టు 5వ తేదీ సోమవారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్లో ఉదయం 10 గంటల నుంచి యథావిధిగా నిర్వహిస్తారని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

# రైతుల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

### ఎంఎల్ఎ బండారు సత్యానందరావు

**ప్రజాశక్తి - ఆలమూరు**

రైతుల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు.కొత్తూరు ఎస్జేఆర్ ఫంక్షన్ హాల్లో రైస్ మిల్లుల అసోసియేషన్ ఆధ్వర్యంలో పారిశ్రామిక వేత్తవంటిపల్లి పాపారావు అధ్యక్షతన రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆదివారం ఎంఎల్ఎ బండారు సత్యానందరావు సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ ప్రస్తుతం ధాన్యం అమ్మకాలు, కొనుగోలులో ఇటు రైతులు, అటు రైస్ మిల్లర్లు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రైతుకు రైస్ మిల్లులకు మధ్యఎవరి ప్రమేయం లేకుండా రైతు నేరుగా తనకు నచ్చిన రైస్ మిల్కు ధాన్యాన్ని అమ్ముకునే సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎంఎల్ఎ బండారు మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అటు రైతులు, ఇటు రైసుమిల్లర్లు ఇబ్బందులు పడ్డారని అది మా దృష్టికి వచ్చిందన్నారు. కొత్తపేట నియోజకవర్గంలోనే రూ. 35 కోట్లు బకాయిలు చెల్లించవలసి ఉందని, శాసనసభా సమావేశాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానాని అన్నారు. అలాగే మరోసారి దానిపై సంబంధిత శాఖ మంత్రులతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. సభలో మాజీ శాసనమండలి ఉపాధ్యక్షుడు రెడ్డి సుబ్రమణ్యం, జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ బండారు శ్రీనివాసు, టిడిపి సీనియర్లు కెవి.సత్య నారాయణరెడ్డి, ఆకుల రామకృష్ణ, యువ నాయకుడు బండారు సంజీవ్ మాట్లాడారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్ల అసోసియేషన్ సభ్యులు వంక అన్నవరం, రెడ్డి రామారావు, వల్లూరి వెంకట్రావు, రెడ్డి దుర్గారావు, చంద్రు శ్రీను, రాయుడు సుధాకర్, యడ్లపల్లి కిట్టయ్య, ఒట్టికూటి సతీష్, వంటిపల్లి కృష్ణమూర్తి, ఎన్డిఎ కూటమి నాయకులు పాల్గొన్నారు.



ఎంఎల్ఎ బండారు సత్యానందరావును సత్కారిస్తున్న మిల్లర్ల అసోసియేషన్

### పలువురికి సన్మానం

మండల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశంలో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణను, మాజీ శాసనమండలి ఉపాధ్యక్షుడు రెడ్డి సుబ్రమణ్యంను, జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ బండారు శ్రీనివాసరావును, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ కెవి.సత్యనారాయణ రెడ్డిను, యువ నాయకుడు బండారు సంజీవ్ను సన్మానించారు.

# డిఎస్‌సి, టెట్‌లకు ఉచిత కోచింగ్

### మంత్రి సుభాష్ వెల్లడి

**ప్రజాశక్తి-రామచంద్రపురం**

మెగా డిఎస్సికి, టెట్కు సంబంధించి నిరుద్యోగులకు ఉచితంగా కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసాం దీనిని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు.ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు రాష్ట్రంలో గత అయిదేళ్లగా నిరుద్యోగం విలయతాండవం చేసిందన్నారు. నిరుద్యోగాన్ని నిర్మూలించేందుకు సిఎం చంద్రబాబు మొదటి సంతకం డీఎస్సి మీద, చివరి సంతకం స్కిల్ డెవలప్మెంట్ మీద చేశారని దీని ద్వారా నిరుద్యోగాన్ని తరిమి కొడతామన్నారు. తన హయాంలో వికాస ద్వారా జాబ్ మేళా ఏర్పాటు చేశామని ఇప్పటికే ఎనిమిది వందల మందికి పైగా ఉద్యోగాలు ఇప్పించామని ఆయన గుర్తు చేశారు. అవినీతిపై నిరంతర పోరాటం కొనసాగిస్తామన్నారు. రామచంద్రపురం ఏరియా ఆస్పత్రిలో మందుల దుకాణంలో అవినీతి రాజ్యమే లేదని అధిక ధరలకు మందులు విక్రయించి సామాన్యులను దోచుకునేవారని, మాజీ మంత్రి వేణు అతని తనయుడు నరేన్ లు సాగించిన అవినీతికి అడ్డుకట్ట వేశామన్నారు. మందుల షాపుల్లో అధిక ధరలు విక్రయిస్తే చర్యలు చేపడతామన్నారు. అదే విధంగా రక్త పరీక్షలకు అధిక ధరలు తీసుకోవద్దని లేకుంటే సమాంతరంగా ల్యాబ్లో ఏర్పాటు చేసి తక్కువ ధరలకు పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు.. అదేవిధంగా తాము తప్పు చేస్తే విలేకరుల ప్రశ్నించవచ్చని అయితే కొన్ని ఛానల్ లో రేటింగ్ కోసం లేనిపోని వార్తలు ప్రసారం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. తనకు ఎన్నికల్లో లక్షకు పైగా ఓటర్ లు ఓట్లు వేశారని చాలామంది ఫొటోలు దిగుతారని వాటిని ఉదాహరణగా చేసుకుంటూ వార్తలు ఇవ్వడం సరైన పద్ధతి కాదన్నారు. ఎవరైనా నేరం చేస్తే చట్ట ప్రకారం వారిని శిక్షిస్తారని అందులో తాను జోక్యం చేసుకోలేదని ఆయన వివరించారు. కార్యక్రమంలో వాసంశెట్టి సత్యం టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

### సంక్షేమ హాస్టళ్లలో సమస్యల పరిష్కారానికి వినతి

పట్టణంలోని ఎస్సి బాయ్స్ అంబేద్కర్ వసతి గహాన్ని తక్షణమే మార్చాలని, సంక్షేమ హాస్టల్లో సమస్యలు పరిష్కరించాలని. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసం శెట్టి సుభాష్ కి పిడిఎస్యు బృందం వినతి పత్రం అందించారు. పిడిఎస్యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధు, పివైఎల్ జిల్లా నాయకులు వెంటపల్లి భీమ శంకరం మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో సంక్షేమ హాస్టళ్ల సమస్యలకు నిలయాలుగా మారాయన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో 12కు పైగా ఎస్సి, ఎస్టి, బిసి సంక్షేమ హాస్టళ్ల ఉన్నాయన్నారు. రామచంద్రపురం, హసన్ బాధ, గంగవరం హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని అన్నారు. ఇటీవల రామచంద్రపురం ఎస్సీ బాయ్స్ అంబేద్కర్ కాలేజీ హాస్టల్, హై స్కూల్ బాలురు వసతి గృహంలో వర్షానికి తడిసిన గోడలు , స్లాబ్ పెచ్చులు ఊడిపోయి పడిపోయాయని మంత్రికి తెలిపారు. పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ఎస్సి, బిసి సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరి స్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు నాయకులు ఎం.సాయిచరణ్, కె.సుధీర్, వై.సతీష్, కరుణాకర్, కె.కిరణ్, అజయ్, చంద్రశేఖర్ తదితర నాయకులు పాల్గొన్నారు.




ఉచిత కోచింగ్ సెంటర్ పోస్టర్లు ఆవిష్కరించిన మంత్రి సుభాష్

## బాధిత కుటుంబానికి 'గుడ్ సీడ్' సాయం

**ప్రజాశక్తి-ఉప్పలగుప్తం**

చిన గాడవిల్లి పంచాయతీ రామాలయంపేట లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటలో నిరాశ్రయులైన మిగిలిన పెనుమాల వెంకటేశ్వరరావు కుటుంబానికి ఆదివారం అమలాపురం నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు, గుడ్సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు సాయం అందించారు. బాధిత కుటుంబానికి వంట సామగ్రి, నిత్యావసర సరుకులు దుస్తులు, కూరగాయలను గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు గంటా లక్ష్మీ ప్రసాద్, కుంచే అర్జున్, పరమట రాజేష్, నాగాబత్తుల రాజ్కుమార్, బళ్ల చినరాజ, దోనిపాటి రాంబాబు, వెంకటేష్, పోలినాటి భీమేష్,పరమట మురళీకష్ణ అందజేశారు.సాయం అందించిన రమణారావుకు బాధిత కుటుంబం కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎన్.శామ్యూల్ రాజు, ఎన్.సుందరరాజు, మచ్చా లోవరాజు, బడుగు దుర్గా రావు, కడిమి సువర్ణ రాజు, మెల్లి క్రిష్ణమూర్తి, పెయ్యల కొండబాబు, పులుసుగంటి సురేష్, అయితాబత్తుల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వంట సామగ్రి, నిత్యావసరాలు, దుస్తులు అందిస్తున్న గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు

# ఎస్‌సి వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం


### చల్లపల్లిలో దళితుల రాస్తారోకో

**ప్రజాశక్తి-ఉప్పలగుప్తం**

ఎస్సి వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని వర్గీకరణ రద్దు చేయాలంటూ ఎస్సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదివారం దళితులు దళిత నాయకులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. అమలాపురం-ఎస్.యానాం ప్రధాన ఆర్అండ్బి రహదారిపై చల్లపల్లి సెంటర్లో రాస్తారోకో నిర్వహించారు.వాహనాల అడ్డుకొని ఎస్సి వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాస్తారోకో లో దళిత ఐక్యవేదిక చైర్మన్ డిబి.లోక్, కన్వీనర్ జంగా బాబురావు, ప్రధాన కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు,గెడ్డం సురేష్ బాబు, ఆర్.తిరుపతిరావు పాల్గొని వర్గీకరణకు వ్యతిరేకంగా మాట్లాడారు. ఎస్సి వర్గీకరణ అంశం ప్రధాని మోడీ, ఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆడుతున్న నాటకం అన్నారు. 2004లో అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు అనేక వాదోపవాదాలు అనంతరం చట్టాల్లో ఉన్నటువంటి న్యాయపరమైన అంశాలకు రాజ్యాంగానికి కట్టుబడి వర్గీకరణ చెల్లదని తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. ఇప్పుడున్నదే అదే రాజ్యాంగం అని అప్పుడు వర్గీకరణ చెల్లదని తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టు ఇప్పుడు వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి మందకృష్ణ మాదిగ ను పావుగా చేసుకుని ప్రజా వ్యతిరేక తీర్పు ఇచ్చారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా ఉన్న 30 కోట్ల ఎస్సిలను సర్వోన్నత న్యాయస్థానం అణగ దొక్కాలని చూస్తే దేశం నుండి ముస్లింలు విడిపోయినట్టే ఎస్సిలు కూడా విడిపోయే అవకాశం ఉందని అన్నారు. ఆర్టికల్ 341 అనుసరించకుండా పార్లమెంటులో చర్చ కూడా జరగకుండా కోర్టు తీర్పు ఇవ్వడం ప్రజాస్వామ్య విరుద్ధమని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉద్యమాన్ని ఉదతం చేసి న్యాయం జరిగే వరకూ పోరాడి వర్గీకరణ అడ్డుకుంటామని హెచ్చరించారు.ఈ సందర్భంగా రహదారిపై వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ కు తీవ్ర అంతరమైన ఏర్పడింది. ఆందోళనలో దళిత నాయకులు ములపర్తి సత్యనారాయణ, గెద్దాడ బుద్ధరాజు, మెండి డేవిడ్ అంబేద్కర్, కాట్రు ఆనందరావు, చికురుమిల్లి సత్యనారాయణ, కుసుమే వెంకన్న, జంగా శ్రీను, గెద్దాడ వెత్రబ్బాయి, మోర్త సుబ్బారావు, బడుగు అర్జునరావు,మాకే విశ్వనాథం, ఇసుకపట్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.



వర్గీకరణకు వ్యతిరేకంగా చల్లపల్లిలో దళిత నాయకుల రాస్తారోకో




# గౌరవ వేతనాల నిర్ణయంపై హర్షం

**ప్రజాశక్తి - అంబాజీపేట**

స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనం నిర్ణయం కూటమి ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం పట్ల రాష్ట్ర సర్పంచ్ ల చాంబర్ సభ్యులు టిడిపి నాయకులు నాగాబత్తుల వెంకట సుబ్బారావు హర్షం వ్యక్తం చేశారు. మంగళగిరిలో ఆదివారం సిఎం చంద్రబాబును మర్యాద పూర్వకంగా ఆయన కలిశారు. రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచులు, జెడ్పిటిసి, ఎంపిటిసి సభ్యులకు రూ.10 వేలు గౌరవ వేతనం ఇస్తామని ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం చొరవ తీసుకొని గౌరవ వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సిఎంకు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ని కలిసేందుకు అనుమతి కోరినట్లు ఆయన తెలిపారు.



సిఎం చంద్రబాబును కలిసిన రాష్ట్ర సర్పంచుల ఛాంబర్ సభ్యులు ఎన్వి.సుబ్బారావు

## మురుగు మళ్లింపునకు చర్యలు

**ప్రజాశక్తి -మామిడికుదురు**

భారీ వర్షాలతో లూటుకుర్రులో ఎన్జిఆర్ కాలనీలో ముంపుకు గురైన ప్రాంతాన్ని సర్పంచ్ అడబాల రామ సత్యనారాయణ పరిశీలించారు. జెసిబితో తవ్వించి అక్కడ మురుగు నీటిని బయటికి పంపించే చర్యలు చేపట్టారు. ఆ ప్రాంతంలో అక్కడి ప్రజలకు ఇబ్బంది లేకుండా పంచాయితీ నిధులతో తూరలను ఏర్పాటు చేసి భవిష్యత్తులో ఇబ్బందులు లేకుండా చేశారు. అనంతరం గ్రామంలోశానిటేషన్ చర్యలు చేపట్టారు.

# సుప్రీంకోర్టు తీర్పుతో అన్ని వర్గాలకు న్యాయం

### దళిత నాయకులు

**ప్రజాశక్తి-కపిలేశ్వరపురం**

ఎస్సి వర్గీకరణలో భాగంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో న్యాయం జరిగిందని, ఎస్సిల్లోని అన్ని వర్గాల వారు తీర్పును స్వాగతించాలని దళిత నాయకులు మల్లెపూడి శివకుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన కపిలేశ్వరపురం మాదిగ సేవా సంఘం ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు తీర్పు ను స్వాగతిస్తూ డాక్టర్ బాబు జగ్జీవన్రామ్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం జగ్జీవన్రామ్ విగ్రహానికి పూలమాలవేసి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఈ ఉద్యమానికి ఆలు పెరగని సుదీర్ఘ పోరాటం చేసిన మందకృష్ణ మాదిగకు ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన విద్య, ఉద్యోగ రంగాల్లో ఈ తీర్పు వల్ల న్యాయం జరుగుతుందని నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్ఆర్పిఎస్ మండల అధ్యక్షులు యార్లగడ్డ సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలివెల వెంకట్రావు, కొమ్ము సతీష్, పలివెల సత్యనారాయణ, నాగరాజు, ముమ్మిడివరపు పెద్ద సత్యం, చినసత్యం, పలివెల సూర్య ప్రకాష్ ,పిప్పర సతీష్ చంద్ర, కొమ్ము రాజు, పిప్పర రాజు తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్ రామ్ విగ్రహానికి క్షీరాబి షేకం చేస్తున్న దళిత నాయకులు

## నేరాలు ఘోరాలు


బాలికను బంధువులకు అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

## దారి తప్పిన బాలిక బంధువులకు అప్పగింత

ప్రజాశక్తి - సామర్లకోట

విశాఖపట్నంలోని కంచరపాలెం మురళీనగర్‌కు చెందిన ఒక బాలిక దారితప్పి సామర్లకోట రైల్వే స్టేషన్‌కు చేరుకోగా ఆదివారం తెల్లవారుజామున రైల్వే పోలీసులు బంధువులకు అప్పగించారు. సామర్లకోట జిఆర్‌పి పోలీసుల సమాచారం శనివారం అర్ధరాత్రి సామర్లకోట రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫారంపై ఒక బాలిక కనిపించింది. రైల్వే పోలీసులు ఆమెను విచారించి స్కూల్ ఐడీ కార్డులో ఉన్న సెల్ నంబర్‌కు ఫోన్ చేయడంతో వివరాలు తెలిశాయి. బాలికకు తండ్రి, తల్లి లేరని, అమ్మమ్మ వద్ద పెరిగిందని తెలిసింది. బాలిక కనిపించడం లేదని అమ్మమ్మ కంచరపాలెంలో ఫిర్యాదు చేసింది. సామర్లకోట రైల్వే పోలీసులు కంచరపాలెం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సామర్లకోట చేరుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున బాలికను వారికి అప్పగించినట్లు రైల్వే పోలీసులు చెప్పారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సీతానగరం

చినకొండేపూడిలో ఒక కోళ్ల ఫారంలో విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందాడు. పెదకొండేపూడి గ్రామానికి చెందిన కారింగుల కొండయ్య(38) కోళ్ల పామ్‌లో కూలీగా పనిచేస్తున్నాడు. కోళ్లను ఎగుమతి చేసేందుకు కోళ్లను తీసుకొస్తుండగా విద్యుత్తు వైర్లకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

ప్రజాశక్తి-నల్లజర్ల

తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్ల గ్రామంలో పంచదార రాజేష్ కుటుంబ సభ్యులతో ద్వారక తిరుమల మండలం ఈస్ట్ ఎడవల్లి గ్రామంలో ఓ ఫంక్షన్‌లో పాల్గొనేందుకు ఇంటికి తాళం వేసి వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చే సరికి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించారు. వెంటనే ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో నాలుగు కాసుల బంగారం, కేజీ వెండి సామగ్రిని చోరీకి గురైనట్టు గుర్తించారు. వెంటనే పోలీసులను ఆశ్రయించారు.

## ఉత్సాహంగా స్నేహితుల దినోత్సవం

ప్రజాశక్తి-యంత్రాంగం

అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని జిల్లాలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.

**తాళ్లరేవు:** పూర్వ విద్యార్థులంతా స్నేహితుల దినోత్సవం సందర్భంగా అందరూ కలుసుకున్నారు. స్నేహితుల దినోత్సవాన్ని ఆనందంగా జరుపుకున్నారు. తాళ్లరేవు నామన వెంకాయమ్మ జెడ్‌పి హైస్కూల్లో 1985 - 86 సంవత్సరంలో చదివిన విద్యార్థులు కొన్నేళ్ల క్రితం గోల్డెన్ గ్రూపుగా ఏర్పడి కష్టంలో ఉన్న స్నేహితులను ఆదుకుంటున్నారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం తాళ్లరేవు లోని తోటి స్నేహితురాలు సామా సుజాత స్వగృహంలో అందరూ కలిసి స్నేహితుల దినోత్సవ వేడుక చేసుకున్నారు. ఒకరికొకరు ఫ్రెండ్ షిప్ బ్యాండ్ లు కట్టుకుని ఆనందంగా గడిపారు.

**కాకినాడరూరల్:** స్నేహం అనేది షరతులు లేని ఆప్యాయతలతో గుర్తించబడిన చాలా స్వచ్ఛమైన సంబంధమని దీనికి ప్రపంచంలో ఎంతో విలువ అని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ స్నేహితుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ మారుతున్న ఆధునిక కాలంలో కష్ట సుఖాలలో పాలుపంచుకునేది స్నేహితులని అన్నారు. అనంతరం డాక్టర్ అడ్డాల స్నేహితులకు పూల మొక్కలు అందజేశారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, ప్రసాద్ నాయుడు, చింతపల్లి సుబ్బారావు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు , విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికలపై సిఎంకు వినతి

**కాకినాడరూరల్** :ఆరు గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని సిఎం చంద్రబాబుకు వినతి పత్రాన్ని అందజేసినట్లు మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. స్థానిక వలస పాకల లో రమణయ్యపేట మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ తదితరులు అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులను సత్కరించి కతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ నగరపాలక సంస్థకు త్వరలోనే ఎన్నికలు నిర్వహించను న్నందున విలీన ప్రక్రియ సాధ్యసాధ్యాలపై పరిశీలిస్తామని అన్నారు. దీనిపై హైకోర్టు ఉత్తర్వులు ప్రకారం పంచాయతీ ఎన్నికలు నిర్వహించి ఎన్నికైన ప్రజాప్రతినిధుల తీర్మానం ప్రకారం విలీనం చేయాలా లేదా అనేది నిర్ణయించాల్సి ఉందని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ విషయమై పార్టీ అధ్యక్షులైన పల్లా శ్రీనివాస్ ను కలవాలని చంద్రబాబు సూచించగా తాము ఆయనను కూడా కలిసి చర్చించామని సత్యనారాయణ మూర్తి తెలిపారు. మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ మాట్లాడుతూ రమణయ్యపేట తదితర గ్రామాలకు గత 13 సంవత్సరాలుగా ఎన్నికలు నిర్వహించనున్నందున అభివృద్ధి కుంటుపడిందని ఈ విషయమై స్పందించిన మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు.

## ఘనంగా సోదరీమణుల దినోత్సవం

**కాకినాడరూరల్** : రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో సోదరీమణుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల సంక్షేమ అధికారి సిహెచ్ వెంకట్రావు మాట్లాడుతూ ప్రతి ఏటా ఆగస్టు మొదటి ఆదివారం జాతీయ సోదరీమణుల దినోత్సవంగా జరుపుకుంటామని అన్నారు. జీవితాంతం అత్యంత సన్నిహిత స్నేహితులుగా సోదరీమణులు మసులుకుంటారని అన్నారు. అక్క చెల్లెల్ల అనుబంధం లో ఒకరికొకరు ఎప్పుడు సంతోషంగా ఉండాలని కోరు కుంటారని అన్నారు. అనంతరం అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో సోదరీమణులకు నూతన వస్త్రాలను బహూ కరించారు.కార్యక్రమంలో డాక్టర్ కె.వెంకటరమణ, న్యాయవాది యనమల రామం, రేలంగి బాపిరాజు, రాజా, ప్రసాద్‌నాయుడు, రామారావు పాల్గొన్నారు.


పులిహోర పంపిణీ చేస్తున్న దాతలు

## యాత్రికులకు ఫలహారాల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మరిడమ్మ జాతర సందర్భంగా 5వ ఆదివారం అత్యధిక సంఖ్యలో యాత్రికులు రావడంతో పలు సంఘాల వారు, స్వచ్ఛంద సంస్థలు యాత్రికులకు వివిధ రకాల ఫలహారాలు, మంచినీరు, పిల్లలకు బిస్కెట్లు,, పాలు పంపిణీ చేశారు. మరిడమ్మ ఆలయ పరిసరాలలో ఏర్పాటు చేసిన శిబిరాల ద్వారా వీటిని అందజేశారు. స్థానిక తాళ్లూరి వారి సత్రం, శ్రీవిజయ దుర్గ గూడ్స్ ఆటో ఓనర్స్ వర్కర్స్ యూనియన్, బంగారమ్మ గుడి వీధి యూత్ ఆధ్వర్యంలో యాత్రికులకు పులిహోర, మంచినీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మమ్మున నాగరాజు, గణేష్, సత్తిబాబు, శ్రీను, చౌదరి, రమేష్, నూకరాజు, గోపి, వెంకన్న, దేవుడు, గోకేడ అప్పారావు, గడ్డం లక్ష్మణరావు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

## తూర్పుపాకలులో తల్లిపాల వారోత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం

తూర్పుపాకలులో సర్పంచ్ పడాల అన్నపూర్ణ అధ్యక్షతన ఆదివారం తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. కాండ్రకోట సిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బి.చంద్ర కిరణ్ బాబు, డాక్టర్ ఉషా ప్రియదర్శిని మాట్లాడారు. బిడ్డల సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలు ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా వారు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. సర్పంచ్ అన్నపూర్ణ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ సూపర్వైజర్ ఉమాదేవి ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సిహెచ్‌ఒ శాంతకుమారి, ఎంపిపి టిఎం.నాగమణి పాల్గొన్నారు.

## నేడు ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

ప్రజాశక్తి -కరప

మండలంలోని ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ తెలిపారు. 23 గ్రామ పంచాయతీల్లో 2023 నుండి మార్చి 2024 వరకు జరిగిన ఉపాధి పనులు, సామాజిక భద్రత పింఛను, సామాజిక తనిఖీ బృందం వారిచే తనిఖీ నిర్వహిస్తారని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.


నిండుకుండలా దర్శనమిస్తున్న ఏలేరు రిజర్వాయర్

## ఏలేరు రిజర్వాయర్‌కు జలకళ

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఇటీవల ఏజెన్సీ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో పాటు, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి నీరు వచ్చి చేరడంతో ఏలేరు రిజర్వాయర్ జలకళను సంతరించుకుంది. రిజర్వాయర్ జలాలు పూర్తిగా అడుగంటి పోవడంతో ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టు రైతుల పరిస్థితి ఏంటి అనుకున్న తరుణంలో వర్షాలు ఆశాజనకంగా మారాయి. రిజర్వాయర్ సామర్థ్యం 86. 56 మీటర్ల కాగా ఆదివారానికి రిజర్వాయర్ నీటిమట్టం 80. 55 మీటర్లకు చేరుతుంది. ప్రస్తుతం రిజర్వాయర్‌లోకి 5021 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. విశాఖ స్టీల్ ప్లాంట్ అవసరాల నిమిత్తం ఎడమ కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, ఆయకట్టుకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.


నిరసన తెలుపుతున్న ఎస్‌సి నాయకులు

## ఎస్‌సి వర్గీకరణ తీర్పుపై నిరసన

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ ఆదివారం దివిలి గ్రామంలో నిరసన తెలిపారు. అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో కండెల్లి వీరబాబు, గుబ్బల రాజు, బండి రాజు, పిల్లి అప్పారావు, ఎన్.శ్రీను, ఎం.ప్రసాద్, జుత్తుగ సత్యనారాయణ, కాటూరి సత్తిబాబు, మడికి శ్రీను, ఎం.వెంకటకృష్ణ, కుంచే నూకరాజు, నిమ్మగంటి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - సామర్లకోట

పలు పోటీల్లో బాలమందిరం విజేతలకు ఆదివారం సాయంత్రం బాలమందిరు నిర్వాహకులు అంగర గోపాలకష్ణ బహుమతుల అందజేసి సత్కరించారు. మాధవపట్నం జమునా నగర్ కాలనీలో అంగర లక్ష్మీ కాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ బాల మందిరంలో ఆదివారం జరిగిన బాలల సభలో విద్యార్థులు పుస్తక పఠనం, కథాకథనం, కథలకు బొమ్మలు వేసే పోటీలు, తొలుత ఇన్ డోర్ గేమ్స్ పోటీలు, చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నారు. విజేతలకు నిర్వాహకులు కృష్ణశ్రీ బహుమతులు అందజేశారు.

## పారిశుధ్య సిబ్బందిని పెంచాలి

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడలో 400 మందికి ఒక్కరు వంతున 1,272 మంది పారిశుధ్య సిబ్బందితో వెట్టి చాకిరీ చందంగా ఉందని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణ రాజు పేర్కొన్నారు. వీరిలో 402 మంది రెగ్యులర్ కాగా కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్‌లో 690, ప్రత్యేక కార్మికులుగా 180 మంది ఉన్నారన్నారు.కనీసంగా ప్రతి100 మందికి ఒక పారిశుధ్య వర్కర్ నియామకం జరగాలన్నారు. స్మార్ట్ సిటీలో పారిశుధ్య కార్మికుల వెట్టి చాకిరీ విముక్తి పొందాలంటే కనీసంగా 4 వేల మంది ఉండాలన్నారు.


ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

## జాతర ఉత్సవాల ప్రారంభం

ప్రజాశక్తి- సామర్లకోట

పట్టణంలో భీమేశ్వరాలయం వద్ద మదుగులమ్మ ఆలయంలో జాతర ఉత్సవాలను పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ఆదివారం ప్రారంభించారు. ఆలయ కమిటీ, రైతు నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన మదుగులమ్మ అమ్మవారి జాతర ఊరేగింపును కొబ్బరికాయ కొట్టి ఎంఎల్ఎ ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం జాతర ఉత్సవం పురవీధుల్లో రాత్రి వరకూ కొనసాగించారు. ఉత్సవాల్లో పట్టణ టిడిపి అధ్యక్ష కార్యదర్శులు అడబాల కుమార స్వామి, బడుగు శ్రీకాంత్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రసాద్, రైతు సంఘం నాయకులు కంటే జగదీష్ మోహన్, మాజీ సొసైటీ అధ్యక్షుడు పైన్ని శ్రీనివాస్‌రావు వల్లూరి దొర, చంద్రు బలరామ్, బలుసు వాసు, ఆలయ కమిటీ నాయకులు, అర్చకులు, రైతుసంఘం నాయకులు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న ఉద్యాన పంటలు

ప్రజాశక్తి -తాళ్లరేవు

వర్షాలు తగ్గు ముఖం పట్టడంతో లంక గ్రామాల్లో వరద తగ్గింది. వరద నీరు లంక గ్రామాలను ముంచెత్తడంతో ఆయా గ్రామాల్లోని ఉద్యానవన పంటలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. మండల పరిధిలో పిళ్ళంక పంచాయతీ కొత్తలంక, ఇంజరం పంచాయతీ అరటికాయలంక గ్రామాల్లో సాగుచేసిన ఉద్యానవన పంటలు మాత్రం కుళ్ళిపోయాయి. ఉద్యానవన శాఖ అధికారుల నివేదిక ప్రకారం ఒక కొత్తలంక గ్రామంలో సుమారు 12 ఎకరాల్లో కాయగూరలు, 4 ఎకరాల్లో అరటి, బొప్పాయి, సుమారు 5 ఎకరాల్లో నువ్వుల పంటకు నష్టం సంభవించినట్లు తెలియజేస్తున్నారు. వరదల వల్ల కలిగిన నష్టాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని లంక గ్రామాల రైతులు కోరుతున్నారు.

## యానాం వార్తలు


యానాంలో సిఎం రంగసామి పుట్టినరోజు వేడుకలు

## ఘనంగా సిఎం రంగసామి పుట్టినరోజు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగసామి పుట్టినరోజు వేడుకలు యానాంలో మల్లాడి అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక మల్లాడి కృష్ణారావు స్వగృహం వద్ద మల్లాడి అభిమానులు కార్యకర్తలు, నాయకులు, ఆశా వర్కర్లు సిఎం రంగసామి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని భారీ కేక్ కట్ చేశారు. ఆయన ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి, స్వీట్స్ పంచారు. అనంతరం యానాం ఓల్డేజ్ హోమ్ వృద్ధులకు, ప్రభుత్వ ఆసుపత్రిలో పేషెంట్లకు ఫ్రూట్స్ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో యానాం మాజీ మున్సిపల్ చైర్మన్ గిడ్ల చంద్రరావు, యానాం రిటైర్డ్ సిఎ గూటం శివ గణేష్, మట్టపర్తి గణేష్, వెంకటేశ్వరరావు, మల్లాడి శ్రీను తదితర నాయకులు పాల్గొన్నారు.


ఎన్నికైన ఆర్‌టిసి ఇయు రాష్ట్ర కార్యవర్గం

## ఆర్‌టిసి ఇయు రాష్ట్ర కార్యదర్శిగా భీమన

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఎపిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కోశాధికారిగా ఏలేశ్వరం డిపో కండక్టర్ భీమన సూరిబాబు ఎంపికయ్యారు. ఈ మేరకు విజయవాడలో జరిగిన యూనియన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో ఆఫీస్ బ్యానర్ల ఎంపిక చేపట్టారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ ఆర్‌టిసి విలీన ప్రక్రియలో సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రిటైర్డ్ ఆర్‌టిసి ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని, సర్క్యులర్ నిబంధనలకు విరుద్ధంగా అనాగరిక క్రమశిక్షణ చర్యలు అమలు పరుస్తున్నారని వీటిని ప్రభుత్వం సవరించాల్సిన అవసరం ఉందన్నారు. సూరిబాబు రాష్ట్ర కోశాధికారిగా ఎన్నిక కావడం పట్ల ఏలేశ్వరం డిపోలోని పలువురు సహచర కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

# చిన్నారుల వైద్యానికి ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-యంత్రాంగం

అనారోగ్యంగా బాధపడుతున్న చిన్నారులకు ఆదివారం పలువురు సాయం అందజేశారు.


ద్రాక్షారామలో చిన్నారి కుటుంబానికిసాయం అందజేస్తున్న మంత్రి సుభాష్

**రామచంద్రపురం:** అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారికి రాష్ట్ర కార్మిక శాఖమంత్రి సుభాష్ రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించి ఆదుకున్నారు. ద్రాక్షారామ లో చిన్నారి వాసంశెట్టి జోష్ణ అనారోగ్యం తో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న మంత్రి వారి ఇంటికి వెళ్లి ఆమె తల్లి తో మాట్లాడారు. చిన్నారి అనారోగ్యంపై ఆమె మంత్రికి వివరించారు. దీనికి స్పందించిన మంత్రి వెంటనే రూ.10 వేలు సాయంగా అందజేశారు. వెంటనే స్పందించి ఆర్థిక సహాయం అందించిన మంత్రికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

**మామిడికుదురు:** అప్పనపల్లి అరుంధతి పేటకు చెందిన 13 ఏళ్ల బాలిక ఆకుమర్తి జ్యోతి అరుదైన వ్యాధితో ఇబ్బందులు పడుంఎంది బాలిక వైద్యానికి ఆరోగ్యశ్రీ లో అవకాశం లేదని డాక్టర్ల చెప్పడంతో బాలిక కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. వ్యాధి నివారణకు పది ఇంజక్షన్ చేయాలని ఒక్కొక్కటి రూ.85వేలు అవుతుందని తండ్రి వాపోయారు ఇంతవరకు మూడు ఇంజక్షన్లు చేయించామన్నారు. ఆర్థిక స్తోమత లేకపోవడంతో దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్నామన్నారు. సానికులు రూ.10 వేలు వసూలు చేసి ఆ సహాయాన్ని ఆదివారం బాలిక తల్లిదండ్రులు రమేష్ శాంత కుమారికి అందజేశారు దాతలు స్వచ్ఛందంగా బాలికకు ఆర్థిక సహాయం అందించాలని ఆర్ఎంపి వైద్యులు కంకిపాటి వెంకటేశ్వరరావు కోరారు కార్యక్రమంలో తులాగోపాలకష్ణ, తుల నాగరాజు,చిన్న,వినయ్, కంకిపాటి నాగేశ్వరరావు, తులా బ్రహ్మాజీ, అల్లూరి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.


అప్పనపల్లిలో బాలిక వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం అందిస్తున్న స్థానికులు



# 11న వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన

## మాల మహానాడు జెఎసి నాయకులు

ప్రజాశక్తి-అమలాపురం


సమావేశంలో మాట్లాడుతున్న మాలమహానాడు నాయకులు

ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టాలని జెఎసి తీర్మానించింది. ఆదివారం అమలాపురం సావరంలో జెఎసి ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం నిర్వహించారు. జిల్లా మాల మహానాడు కమిటీలు అన్నీ కలిసి మాల మహానాడు జాయింట్ యాక్షన్‌గా ఆగస్టు 11న మాల మత వీరుల సంస్మరణ దినం సందర్భంగా మత వీరులకు ఘన నివాళి అర్పిస్తారు. అనంతరం ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక నిరసన కార్యక్రమం చేపట్టాలని మాలమహానాడు జెఎసి నిర్ణయించింది. అలాగే మాల మహానాడు అనే బ్రాండ్‌ని పివి.రావు త్యాగాన్ని నిర్వీర్యం చేసే అధికారం ఎవరికీ లేదని ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాటం ఎప్పటికీ మాలమహానాడు జెఎసి ద్వారానే జరుగుతుందని మాలమహానాడు తీర్మానించింది. కార్యక్రమం లో పండు అశోక్ కుమార్, ఎంఎకె.భీమారావు, జగడం సత్యనారాయణ, చీకురుమెల్లి కిరణ్ కుమార్, ఉండ్రు బాబ్జి, పోతుల నాగరాజు, పెనుమాల చిట్టిబాబు, కాశి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సుభాష్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం

ప్రజాశక్తి-రామచంద్రపురం

అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కేకును మంత్రి విలేకరుల సమక్షంలో కట్ చేశారు. అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం శుభాకాంక్షలు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా రామచంద్రపురం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సంఘాల సమస్యల ను పరిష్కరిస్తానని, ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు, ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి తన వంతు కషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అదేవిధంగా విలేకరులు సంఘాలు, విభేదాలు లేకుండా ఐక్యంగా కొనసాగాలనికోరారు. కార్యక్రమంలో మంత్రి తండ్రి వాసంశెట్టి సత్యం, మీడియా సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు ప్రసంగించారు. రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల సభ్యులు పాల్గొన్నారు.


కేకు కట్ చేస్తున్న మంత్రి సుభాష్

## ధనమ్మ మర్రికి పర్యాటకుల తాకిడి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మండలంలోని లంక గ్రామమైన కేదార్లంక శివారు వీధి వారి లంకలో ధనమ్మ మర్రికి ఆదివారం యాత్రికులు, పర్యాటకులు తరలివచ్చారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన యాత్రికులు ధనమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. గోదావరి నది తీరం వెంబడి ఆహ్లాదకరమైన అందాలను ఆస్వాదిస్తూ సందడి చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అంగర ఎస్ ఐ ఎ.పరదేశి పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.


ధనమ్మ మర్రి వద్ద సందడి చేస్తున్న యాత్రికులు


ఎస్ఐ శ్రీనునాయక్‌కు చిత్రపటాన్నిబహూకరిస్తున్న ఉపాధ్యాయుడు

## ఎస్‌ఐకు చిత్రపటం బహూకరణ

ప్రజాశక్తి-ఆలమూరు

స్థానిక పిఎస్‌లో ఆదివారం ఎస్‌ఐ ఎల్.శ్రీను నాయక్‌కు స్వీయ చిత్రపటాన్ని డ్రాయింగ్ ఉపాధ్యాయుడు బహూకరించారు. రాయవరం మండలంలోని వెదురుపాక జెడ్‌పి హైస్కూల్లో డ్రాయింగ్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న వాసంశెట్టి రాధాకృష్ణ ఎస్‌ఐ శ్రీను నాయక్ ఫొటోను కాన్వాయస్ పద్ధతిలో రంగులతో అద్ది చిత్రపటాన్ని తీర్చిదిద్దారు. ఆ చిత్రపటాన్ని ఆదివారం ఎస్‌ఐకు అందజేశారు. ఉపాధ్యాయుడు మాట్లాడుతూ మూడేళ్ల క్రితం రాయవరం ఎస్‌ఐగా పనిచేసి కోవిడ్ సమయంలో అనేక సేవలు అందించారన్నారు. ఆ సేవలకు మెచ్చి ఈ చిత్ర పటాన్ని బహూకరించానని గోపికృష్ణ తెలిపారు. ఎఎస్ ఐలు ఎం.సూర్యచంద్రరావు, కెవి.రమణారెడ్డి పాల్గొన్నారు.

## గంజాయి నిర్మూలనకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లాలో గంజాయి నిర్మూలనకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని ఎస్‌పి నరసింహకిషోర్ తెలిపారు. రాజానగరం మండలం దివాన్‌చెరువు వద్ద 443 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను డిఎస్‌పి అంబికాప్రసాద్ వివరించారు. ఒక వ్యాన్‌లో తెల్లని ప్లాస్టిక్ సంచుల్లో గంజాయిని తరలిస్తున్నారన్నారు. పోలీసులు తనిఖీలు చేసి దీన్ని పట్టుకునాని తెలిపారు. తమిళనాడుకు చెందిన వ్యాన్ డ్రైవర్ దివాకర్‌ను అరెస్టు చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడారు. నగరంలో ఇప్పటికే గుర్తించిన పలు ప్రాంతాల్లో పోలీసిర్‌ను బలోపేతం చేశామన్నారు. మాదక ద్రవ్యాల అమ్మకాలు, వినియోగం, రవాణాపై ఉక్కుపాదం మోపుతామన్నారు. గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు.